నాలుగేళ్లలో నవోదయం



నిర్మాణం పూర్తయిన నేలపర్తిపాడు ఆర్‌బీకే

- గ్రామాల్లో వ్యవసాయ విప్లవం
- ప్రభుత్వ సహాయ సహకారాలన్నీ గ్రామంలోనే
- వేగంగా ఆర్బీకే భవన నిర్మాణాలు
- పెట్టుబడి సాయంతో పెరిగిన రైతు పరపతి

రామచంద్రపురం రూరల్: రైతే రాజు అనేది దశాబ్దాలుగా నెరవేరని నినాదంలా ఉండిపోయింది. కానీ ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి నిజం చేసి చూపించారు. అదే వరవడిలో మరో నాలుగడుగులు ముందుకు వేసి దేశం యావత్తూ మన రాష్ట్రం వైపు చూసేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నదాతలకు అండగా నిలుస్తున్నారు. రాష్ట్రంలో ఆయన నేతృత్వంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత రైతు భరోసా పేరుతో రైతులకు పెట్టుబడి సాయం అందిస్తున్నారు. రైతులను వ్యవసాయ శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలనే ఆశయంతో వ్యవసాయ సిబ్బందిని, వ్యవసాయ గ్రంథాలను అందుబాటులో ఉంచుతూ రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల ద్వారా విత్తనం నుంచి పంట కొనుగోలు వరకు రైతులకు అండగా, ఆసరాగా నిలుస్తున్నారు. వైఎస్సార్ రైతు భరోసా కింద ఈ ఏడాది రామచంద్రపురం మండలంలోని 9064 మంది రైతులకు రూ.4.98 కోట్లు సాయం అందించారు. యంత్ర సేవాపథకం క్రింద 24 గ్రూపులకు (120 మంది రైతులకు) రూ. 2.87 కోట్ల విలువ గల యంత్రాలు రూ.1.15 లక్షల సబ్సిడీపై అందించడం జరిగింది.

మాట నిలుపుకొన్నారు



ప్రజా సంకల్పయాత్రలో రైతులకు పెట్టుబడి సాయం అందిస్తామని జగనన్న మాటిచ్చారు. ఆ మాట ప్రకారం గత నాలుగేళ్లుగా ఆర్థిక సాయం అందించారు. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభానికి ముందుగానే రైతుల ఖాతాలకు జమ చేశారు. రైతుల కష్టాలు తెలుసుకుని సాగుకు పెట్టుబడి సాయం అందిస్తున్నారు. వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ కింద ఏటా రైతులకు అందిస్తున్న రూ.13,500 పెట్టుబడి సాయం ఎంతగానో ఉపయోగపడుతోంది. – **పలివెల నాగరాజు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్, వెలంపాలెం**

సబ్సిడీపై వరి కోత యంత్రం తీసుకున్నాం



మా గ్రామంలో రూ.24 లక్షలతో వరి కోత యంత్రం తీసుకున్నాం. దీనికి ప్రభుత్వం రూ.8 లక్షల సబ్సిడీ అందించింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయాన్ని పండగ చేసింది. ఆకాల వర్షాల్లో పంట నష్టపోయిన రైతులకు స్థానిక మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ సహకారంతో సకాలంలో నష్టపరిహారం అందించారు.

– **కట్టా గోవిందు, రైతు, తాళ్లపొలం**

కంటికి రెప్పలా కాపాడుతున్నారు



రైతుల కోసం అది చేస్తాం, ఇది చేస్తాం అని చెప్పడమే కానీ నా 17 ఏళ్ల సర్వీసులో రైతులను కంటికి రెప్పలా కాపాడుతున్న ప్రభుత్వాన్ని ఇప్పుడే చూస్తున్నాను. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతులను ఆదుకుంటున్న తీరు చూస్తుంటే నిజంగా రైతు రాజులా నిలబడతాడనే నమ్మకం కలుగుతోంది.

– **ఎస్.సత్యప్రసాద్, ఏవో, రామచంద్రపురం మండలం**

గ్రామస్థాయిలోనే రైతులకు అండగా..

గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఏ చిన్న అవసరం వచ్చినా రైతులు మండల కేంద్రంలోని వ్యవసాయ అధికారి కార్యాలయానికి పరుగులు పెట్టాల్సి వచ్చేది. నేడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా గ్రామస్థాయిలోనే రైతుల వద్దకు అవసరమైన అన్ని సేవలు వచ్చి చేరాయి. రామచంద్రపురం మండలంలో రూరల్ 25 గ్రామాల్లో 20 ఆర్‌బీకేలు ఉన్నాయి. అదే విధంగా పట్టణంలో ఒక ఆర్‌బీకే కేంద్రం ఉంది. వీటిలో 7 చోట్ల భవనాల నిర్మాణాలు పూర్తి కాగా, మిగిలినవి వివిధ దశల్లో నిర్మాణాలు ప్రగతిలో ఉన్నాయి. వీటి ద్వారా రైతులకు విత్తనం అందించడం నుంచి పండిన పంట కొనుగోలు వరకు వ్యవసాయ సహాయకులు అండగా ఉంటున్నారు. సాగులో సూచనలు, సలహాలు అందిచడంతో పాటు ఈ–క్రాప్ నమోదు, పంట నష్టం వస్తే వెంటనే అంచనా వేసి ఇన్‌పుట్ సబ్సిడీ అందించే చర్యలు తీసుకుంటున్నారు. ఆర్‌బీకేల్లో సిబ్బంది రైతులకు అవసరమైన వ్యవసాయ పరిజ్ఞానాన్ని అందించడంతో పాటు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను సకాలంలో రాయితీపై అందిస్తున్నారు. భూసార పరీక్షలు చేయించడం, పంటల బీమా వంటివి చేపడుతున్నారు. పశువుల బీమా, వైద్య సహాయం, వాటికి కావాల్సిన సంపూర్ణ దాణా వంటి సేవలు అందించడంలోనూ ఆర్‌బీకేలు విశేష సేవలు అందిస్తూ పాడి రైతులకు కూడా అండగా నిలుస్తున్నాయి.

క్లుప్తంగా

గృహ నిర్మాణాలు పూర్తి చేయండి

ఆర్డీఓ సింధూ సుబ్రహ్మణ్యం


కపిలేశ్వరపురంలో అధికారులకు ఆదేశాలిస్తున్న ఆర్డీఓ సింధూ సుబ్రహ్మణ్యం

కపిలేశ్వరపురం: పేదలకు ఇళ్ల పథకంలో భాగంగా లబ్ధిదారులకు కేటాయించిన ప్లాట్లలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు అధికారులు చొరవ చూపాలని ఆర్డీఓ సింధూ సుబ్రహ్మణ్యం మండల అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించారు. ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ కొమరం సూర్యారావు, హౌసింగ్ ఏఈ పీవీవీఎస్ఎన్ మూర్తిల సమక్షంలో గ్రామ కార్యదర్శులు, యామినేటర్లు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో చర్చించారు. ప్రభుత్వం ఉచితంగా ఇచ్చిన స్థలంలో ఇల్లు నిర్మాణానికి ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థిక సాయంపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. నిర్దేశించుకున్న లక్ష్యాన్ని పూర్తి చేసే దిశగా అడుగులు వేయాలన్నారు. హౌసింగ్ ఏఈ మూర్తి మాట్లాడుతూ వారంలో 80 ఇళ్ల పూర్తి చేయాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్టు తెలిపారు. సమావేశంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ జి.వెంకటేష్, రామచంద్రపురం డీఈఈ మల్లికార్జునరావు, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ బాలాజీ పాల్గొన్నారు.

నేడు ఆర్వో ప్లాంట్ ప్రారంభం

రాయవరం: చెల్లూరు గ్రామ సచివాలయం–1లో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆదివారం ఉదయం 9.30 గంటలకు ప్రారంభించనున్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవో కె.నరేంద్రరెడ్డి శనివారం విలేకరులకు తెలిపారు.

జగనన్న లేఅవుట్‌కు విద్యుత్ వెలుగులు

కె.గంగవరం: మండలంలోని పాణింగపల్లిలో జగనన్న లేఅవుట్ వద్ద నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎంపీపీ పంపన నాగమణి, జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మీ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ప్రతి పేద వాడికి ఇళ్ల స్థలం ఇవ్వడంతో పాటు ఇంటి నిర్మాణానికి కూడా ఆర్థిక సాయం అందించారన్నారు. జగనన్న లేఅవుట్ల పేరుతో ఏకంగా ఊర్లనే కొత్తగా నిర్మించారని చెప్పారు. ఇప్పుడు వారికి ఇబ్బంది లేకుండా నూతన విద్యుత్ లైన్లు వేసి కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను కూడా అందించి విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారని తెలిపారు. వైస్ ఎంపీపీ నీతిపూడి మధుబాల, సర్పంచ్ చీకట్ల సునీత, సొసైటీ అధ్యక్షుడు వైట్ల అచ్యుతరామప్రసాద్, గ్రామ పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం


పేదలకు అన్నదానం చేస్తున్న రాజుబాబు, సత్యకృష్ణ

మండపేట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు రెడ్డి రాజుబాబు జన్మదిన వేడుకలను పురస్కరించుకుని శనివారం వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు చేశారు. ఆదర్శ హెల్పింగ్ హ్యాండ్స్ నిత్యాన్నదాన సంస్థ, అన్నపూర్ణమ్మ ఆలయం వద్ద పేదలకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అంధుల పాఠశాలలోని విద్యార్థులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాలకు రాజుబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, జెడ్పీటీసీ సభ్యురాలు కుడిపూడి భవాని, మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, విప్ పోతంశెట్టి ప్రసాద్, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు నాళం వారి వీధిలోని ఆయన కార్యాలయానికి చేరుకుని రాజుబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం నియోజకవర్గ కన్వీనర్ చోడే సత్యకృష్ణ, శ్రీకృష్ణ, అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, మండపేట శెట్టిబలిజ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పంపన శ్రీనివాస్, పార్టీ నాయకులు దుగ్గిరాల రాంబాబు, ముక్కా దాలయ్య, కొవ్వాడ అప్పన్నబాబు, లేగా వెంకన్న, మహంతి అసిరినాయుడు, తాడి రామారావు, శ్రీకృష్ణ ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు నగదు రివార్డులు

రామచంద్రపురం: పట్టణంలో జరిగిన బైక్ డిక్కీ దొంగతనం కేసులో ఎంతో చాకచక్యంగా చోరులను గుర్తించి పట్టుకున్న రామచంద్రపురం పోలీస్ అధికారులు, కానిస్టేబుల్స్‌కు జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ నగదు రివార్డులు అందజేశారు. శనివారం అమలాపురం ఎస్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారికి నగదు బహుమతులను అందజేశారు. గత నెల 8న పట్టణంలో జరిగిన డిక్కీ దొంగతనం కేసులో దొంగిలించిన రూ.3.55 లక్షలను రికవరీ చేసిన. ఎస్సై డి.సురేష్‌బాబు, హెడ్ కానిస్టేబుల్స్ వీరబాబు, మల్లికార్జునరావు, కానిస్టేబుల్స్ జగదీష్, సూరిబాబు, అనిల్, హోం గార్డు మహేష్‌లను ఎస్పీ శ్రీధర్ అభినందించి నగదు రివార్డులను అందజేశారు. రామచంద్రపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్, సీఐ దుర్గారావు పాల్గొన్నారు.

అర్హతే పథకాలకు ప్రామాణికం

- దుగ్గుదుర్రులో గడప గడపకూ..
- పాల్గొన్న మంత్రి వేణుగోపాలకృష్ణ


దుగ్గుదుర్రులో మహిళలకు ప్రభుత్వం నుంచి వచ్చిన లబ్ధిని వివరిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

కాజులూరు: జగనన్న పాలనలో సంక్షేమ పథకాల అమలుకు అర్హతే ప్రామాణికమని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మండలంలోని దుగ్గుదుర్రులో మంత్రి వేణుగోపాలకృష్ణ శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వలంటీర్లు, కార్యకర్తలతో ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరినీ పలకరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందుతున్నదీ లేనిదీ ఆరా తీశారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న లబ్ధిని అందరికీ వివరించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రజాసంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలన్నీ పారదర్శకంగా అమలు చేస్తున్నారని పార్టీలు, వర్గవిభేదాలకు తావివ్వకుండా వలంటీర్ల ద్వారా అర్హులైన లబ్ధిదారులందరికీ నేరుగా అందిస్తున్నారన్నారు. కుల మతాలు, పార్టీలకతీతంగా అభివృద్ధి, సంక్షేమ పాలన అందిస్తున్నామని భారతదేశం మొత్తం మీద ఇంత భారీ ఎత్తున పెద్ద సంఖ్యలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ఒక్క జగనన్నకే దక్కుతుందన్నారు. పలు స్థానిక సమస్యలను ప్రజలు మంత్రి దృష్టికి తీసుకురాగా వాటిపై ఆరా తీసి పరిష్కారానికి వెంటనే తగు చర్యలు తీసుకోవలసిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు.

కార్యక్రమంలో ఎంపీపీ మాత భారతి, వైస్ ఎంపీపీ పెదిరెడ్డి వెంకటరమణ, సర్పంచ్ పోతు వెంకటలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ రేమళ్ళ చిట్టియ్యదొర, రామచంద్రపురం వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ దంగేటి అరుణ్ కుమార్, మాజీ ఎంపీటీసీ మాత నూకరావు, పోతు శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లా దొంగల ముఠాను ఛేదించిన పట్టణ పోలీసులు

ఎస్పీ శ్రీధర్ ప్రత్యేక అభినందనలు


పట్టణ పోలీసులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న ఎస్పీ శ్రీధర్

మండపేట: స్కూటర్ డిక్కీలు పగలుగొట్టి నగదు చోరీలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగలను ముఠాను చాకచక్యంగా పట్టుకున్న పట్టణ పోలీసులను జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ అభినందించారు. ఈనెల 19వ తేదీన పట్టణంలోని కృష్ణా థియేటర్ సమీపంలో పార్కింగ్ చేసిన స్కూటర్ డిక్కీని పగలుగొట్టి రూ.62వేలు చోరీ చేశారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పట్టణ పోలీసులు రామచంద్రపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ ఆదేశాల మేరకు సీఐ పి.శివగణేష్ నేతృత్వంలో ఎస్ఐ ఎం.అశోక్, ఏఎస్ఐ చిన్నారావు, హెచ్‌సీ నాగేశ్వరరావు, కానిస్టేబుళ్లు ఎస్.బ్లేస్సస్, జి.రమేష్, సీహెచ్ ఏసు, ఎస్.సతీష్ రెండు బృందాలుగా విడిపోయి దర్యాప్తు చేపట్టారు. ఇది చిత్తూరు జిల్లాకు చెందిన నలుగురు అంతరాష్ట్ర దొంగల ముఠా పనిగా గుర్తించారు. ఈనెల 26వ తేదీన బైపాస్ రోడ్డులో నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1,92300 నగదు, మూడు మోటారుసైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వీరు చేసిన నేరాలకు గాను పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదై ఉన్నట్టు పోలీసుల విచారణలో వెల్లడైంది. రాష్ట్ర వ్యాప్తంగా నేరాలకు పాల్పడుతున్న ఈ ముఠాను పట్టుకున్న సందర్భంగా రామచంద్రపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్, సీఐ పి.శివగణేష్, ఎస్ఐ అశోక్, ఇతర సిబ్బందిని ఎస్పీ శ్రీధర్ శనివారం అమలాపురంలోని తన కార్యాలయంలో అభినందించారు. కేసు ఛేదనలో పని చేసిన వారికి నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు.

గ్రామ సచివాలయం, ఆర్‌బీకేల ప్రారంభోత్సవం


గ్రామ సచివాలయ భవనం ప్రారంభిస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఏరుపల్లి గ్రామంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ శనివారం రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.21.80 లక్షలతో నిర్మించిన ఆర్‌బీకే భవనాలను ప్రారంభించారు. మంత్రి వేణు మాట్లాడుతూ గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని నిజం చేస్తూ సీఎం జగన్ అన్ని ప్రభుత్వ సేవలను గ్రామంలోనే అందించే విధంగా గ్రామ సచివాలయాలు, రైతులకు ఆర్‌బీకేలు, ఆరోగ్యం కాపాడడానికి వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేసి దేశానికే దిక్సూచిగా నిలిచారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, సర్పంచ్ మల్లిమొగ్గల శ్రీధర్, నాయకులు రెడ్డి గోవిందు, నందిక వీర్రాజు, పల్ల ఆదినారాయణ, దేవు వెంకన్నబాబు, బొమ్ము వెంకన్నబాబు, చిల్లా గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందించడమే లక్ష్యం

- ఎమ్మెల్సీ తోట
- పట్టణంలో జగనన్న సురక్ష కార్యక్రమాలు


మారేడుబాకలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్సీ తోట, చైర్‌పర్సన్ దుర్గారాణి


కూర్మాపురంలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ తదితరులు


పాణింగపల్లిలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందిస్తున్న ఎంపీపీ నాగమణి తదితరులు


అంద్రంగిలో లబ్ధిదారులకు ఎల్ఈసీ కార్డు అందజేస్తున్న తహసీల్దార్ సాయిసత్యనారాయణ

మండపేట: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నరని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. పట్టణంలోని 1, 2, 3 వార్డులకు సంబంధించి 1వ సచివాలయం వద్ద, 14, 16, 17 వార్డులకు సంబంధించి 7వ సచివాలయం వద్ద, మండలంలోని మారేడుబాక సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజుతో కలిసి ఎమ్మెల్సీ తోట ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల చైర్‌పర్సన్ దుర్గారాణి అధ్యక్షతన జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో లబ్ధిదారుల సంఖ్యకు ఏ విధంగా కోత పెట్టాలని చూసేవారన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదని, క్షేత్రస్థాయిలో అర్హత కలిగిన వారందరికీ సంక్షేమ పథకాలను చేరువ చేసేందుకు సీఎం జగన్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్సీ తోట పేర్కొన్నారు. ధృవీకరణ పత్రాల కోసం రోజుల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేకుండా ఒక్క రోజులోనే జగనన్న సురక్ష శిబిరాలు వద్ద అందిస్తున్నారన్నారు. అనంతరం 790 మంది లబ్ధిదారులకు ధృవీకరణ పత్రాలను ఎమ్మెల్సీ తోట, చైర్‌పర్సన్ దుర్గారాణి పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్, ఎంపీడీఓ ఐ.రాజు, తహసీల్దార్ టీఆర్ రాజేశ్వరరావు, షేక్, జంగమ కార్పొరేషన్ల డైరెక్టర్లు షేక్ ఆలీఖాన్‌బాబా, మీగడ శ్రీనివాస్, విప్ పోతంశెట్టి ప్రసాద్, అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, జేసీఎస్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు, కౌన్సిలర్లు చిట్టూరి సతీష్, శెట్టి కళ్యాణి, మెండు బాపిరాజు, మండపల్లి రవికుమార్, పిల్లి శ్రీనివాసు, కొవ్వాడ బేబీ, మలసాని సీతామహాలక్ష్మి, అమలదాసు లక్ష్మి, మొండి భవాని, నీలం దుర్గ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రాయవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన జగనన్న సురక్ష విప్లవాత్మక కార్యక్రమమని జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ అన్నారు. మండలంలోని కూర్మాపురం, నదురుబాద గ్రామాల్లో జగనన్న సురక్ష ప్రారంభ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు చౌటుపల్లి చక్రవేణి, చింతపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ మంగతాయారు, ఎంపీపీ వెంకటరమణ మాట్లాడతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తూ ఇంకా ఎవరైనా లబ్ధిదారులు ఉన్నారేమో అని గుర్తించి వారికి కూడా పథకాలు అందించేలా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో 546 కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, సీసీఆర్‌సీ, మ్యారేజ్ సర్టిఫికేట్, రైస్ కార్డులు తదితర దరఖాస్తులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మండపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ ఈతకోట లక్ష్మణరావు, ఎంపీటీసీ వాసంశెట్టి వెంకటలక్ష్మి, సచివాలయ కన్వీనర్ తమలంపూడి సత్యనారాయణరెడ్డి, ఎంపీడీవో కొవ్వూరి సరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతి పేదవాడికి ప్రభుత్వ పథకాలు నూరుశాతం అందించాలనే లక్ష్యంతో రూపొందించిన జగనన్న సురక్ష కార్యక్రమం పేదలకు వరం లాటిందని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. మండలంలోని పాణింగపల్లి, అద్దంపల్లి గ్రామాల్లో శనివారం జగనన్న సురక్షలో భాగంగా లబ్ధిదారులకు జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మీతో కలసి ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు 99 శాతం ప్రజలకు అందుతుండగా మిగిలిన ఒక్క శాతం అందించేందుకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాటు ఇటీవల కాలంలో జగనన్న స్పందన, జగనన్నకు చెబుదాం వంటి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఈ టోకెన్ తీసుకుని లబ్ధిదారుడు క్యాంపు వద్దకు వస్తే క్షణాల్లోనే వారికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారన్నారు. ప్రతి ఒక్కరు ఈ జగనన్న సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకుని ఉచితంగా అవసరమైన ధ్రువపత్రాలను పొందాలని ఆమె కోరారు. అనంతరం లబ్ధిదారులకు సంబంధిత ధ్రువపత్రాలను అందించారు. సర్పంచ్ చీకట్ల సునీతగోపాలం, సొసైటీ అధ్యక్షుడు అచ్యుతరామయ్య, తహసీల్దార్ వైద్యనాథ శర్మ, వైస్ ఎంపీపీ నీతిపూడి మధుబాల పాల్గొన్నారు.

కాజులూరు: మండల గ్రామాల్లో జరుగుతున్న జగనన్న సురక్ష పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల తహసీల్దార్ బి.సాయిసత్యనారాయణ అన్నారు. శనివారం అంద్రంగిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మండల తహసీల్దార్ సాయిసత్యనారాయణ, ఎంపీడీఓ ఐ.రత్నంరాజు తదితరులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కుల, మత, పార్టీల భేదం లేకుండా అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఏ కారణం చేతనైనా ఇంకా పథకాలు అందకుండా మిగిలిపోయిన లబ్ధిదారులు ఉంటే వారిని గుర్తించి తగిన న్యాయం చేయాలన్నదే కార్యక్రమ ఉద్దేశమన్నారు. గ్రామ సర్పంచ్ పెద్దిరెడ్డి నాగసుజాత, ఎంపీటీసీ మట్టా వెంకటరమణమ్మ ఆర్ఐ వేగేశ్వరరావు, వీఆర్వో ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేదరికమే ప్రామాణికంగా పథకాలు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- రాయవరంలో గడపగడపకూ మన ప్రభుత్వం


రాయవరంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్సీ త్రిమూర్తులు

రాయవరం: కులమతాలు, రాజకీయాలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ఒక్క వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. రాయవరంలో శనివారం సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, ఉప సర్పంచ్ బొడ్డు శ్రీనివాస్, ఎంపీపీ నౌడు వెంకటరమణ, జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ తేతల సుబ్బరామారెడ్డితో కలిసి గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ త్రిమూర్తులు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు, ప్రభుత్వం పనితీరు, స్థానిక సమస్యలను తెలుసుకునేందుకే ప్రభుత్వం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. ప్రతి గడపకు వెళ్లి ప్రజలకు అమలు చేస్తున్న పథకాలను వివరించి, అదుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కేవీఆర్ ఆస్పత్రి అధినేత డాక్టర్ తేతల నవీన్ రెడ్డి, వైస్ ఎంపీపీ గుబ్బల సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ గంటి రోజా, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు పోలిమాటి సుధాకర్, వెంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ పులగం శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు మంతెన అచ్యుతరామరాజు, తాడి రామచంద్రారెడ్డి, పడాల కమలారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిన్నం అపర్ణాదేవి, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్స్ డే


గొల్లపాలెంలో డాక్టర్ సత్తి శ్రీరామారెడ్డిని సత్కరిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు


మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బిక్కినను సత్కరిస్తున్న పీఎంపీ అసోసియేషన్ నాయకులు


రాయవరం పీహెచ్‌సీ డాక్టర్ దేవిరాజశ్రీ, శ్రీనివాస్ దంపతులను సత్కరిస్తున్న సిబ్బంది

మండపేట: స్థానిక పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే శనివారం మండపేటలో ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బిక్కిన కృష్ణార్జున చౌదరి, డాక్టర్ బిక్కిన గోపాలకృష్ణ, డాక్టర్ పద్మ దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ మాట్లాడుతూ 1882 జూలై ఒకటిన జన్మించిన బీసీరాయ్ వైద్య విద్యనభ్యసించారన్నారు. 14 ఏళ్ల పాటు పశ్చిమ బెంగాళ్ సీఎంగా చేస్తూనే పేదలకు వైద్యసేవలు అందించడం ఆయన గొప్పతనానికి నిదర్శనమన్నారు. 1992 జూలై 1న ఆయన మరణించారన్నారు. ఆయన సేవలకు గుర్తుగా జాతీయ వైద్యుల దినోత్సవం నిర్వహించుకుంటున్నామని వివరించారు. కౌన్సిలర్ మారిశెట్టి సత్యనారాయణ, సంఘ నాయకులు బల్లా వెంకటరవణ, వానపల్లి కనకరాజు, మండిపూడి చంద్రశేఖర్, సుంకర బాలాజీ, పిల్లా సతీష్, నరేష్, పవిత్ర చౌదరి, కె.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

రాయవరం: నదురుబాదలో శనివారం ఘనంగా డాక్టర్స్ డే నిర్వహించారు. సర్పంచ్ చింతపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన, మండపేట మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు నేతృత్వంలో జరిగిన డాక్టర్స్ డే కార్యక్రమంలో రాయవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎ.దేవిరాజశ్రీ, శ్రీనివాస్ దంపతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు, మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్, ఇరిగేషన్ ఏఈ నాగరాజులు పాల్గొన్నారు.

కాజులూరులో..

కాజులూరు: మండల గ్రామాల్లో శనివారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని స్థానికులు ఘనంగా నిర్వహించారు. బాదాస్ చంద్రరాయ్ జయంతి పురస్కరించుకుని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సాగిరాజు సూర్యనారాయణరాజు, కార్యదర్శి కొల్లు వెంకటేశ్వర్రావుల ఆధ్వర్యంలో స్థానిక శ్రీరామానర్సింగ్‌హోమ్ అధినేత సత్తి శ్రీరామారెడ్డిని సభ్యులు ఘనంగా సత్కరించగా లయన్స్ క్లబ్ ఆఫ్ స్వాతి హెల్పింగ్ హ్యాండ్స్ డైరెక్టర్ కడలి రాంపండు ఆధ్వర్యంలో స్థానిక పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సౌజన్య, బీఎస్ రామ్‌లను క్లబ్ సభ్యులు శాలువాలతో సత్కరించారు. లయన్స్ క్లబ్ సభ్యులు నల్లమిల్లి ఈశ్వర్‌రెడ్డి, మండపాటి రఘు, డీసీ సూర్యనారాయణరాజు, విశ్రాంత ఉపాధ్యాయులు మేడిశెట్టి శ్రీరాములు పాల్గొన్నారు.